# అమ్మ

## సింహాప్రసాద్

> **కొంచెంగా వారి సంభాషణ విన్న మహాలక్ష్మమ్మకంతా అయోమయంగా అనిపించింది. కోడలెందుకలా ఆందోళన పడుతోందో అర్థం కాలేదు బొత్తిగా. ఆమె తల్లి మనస్సు ఏదో కీడును శంకిస్తుంటే ...**

ఆతల్లి ప్రేమలాంటి వెన్నెల్లో డాబామీద సేదతీరుచుకొని మహాలక్ష్మమ్మగారు ఒకింత నడుం వాల్చారో లేదో "బామ్మా బామ్మా" అంటూ పరుగెత్తుకొచ్చారు మనుమళ్ళు రాజు, సుభాష్ మనుమరాలు ఆరతీనూ.

"ఏమర్రా అపుడే చదువులైపోయాయా?"

"ఓ" అని రాజు తలూపితే "హోమ్‌వర్క్ కూడా చేసేసుకున్నాంగా." అంది ఆరతి.

"చదువుకోకుండా నీతో కబుర్లు చెబితే మా మమ్మీ ఊరుకుంటుందేవిటీ" అన్నాడు సుభాష్.

"నువ్వు నిజంగా గడుగ్గాయివేరా" అందావిడ సుభాష్ బుగ్గగిల్లి.

ముద్దొస్తున్న పదేళ్ళలోపు కొడుకుబిడ్డల్ని అభిమానంగానూ అపురూపంగానూ చూస్తూ మురిసి పోయిందావిడ.

"ఒక మంచి కథ చెప్పు బామ్మా" గారాలుపోతూ అంది ఆరతి బామ్మ ప్రక్కనే కూర్చుంటూ.

"రాజకుమారుడు కథ చెప్పు బామ్మా" అని రాజు అన్నాడో లేదో "తన పేరు రాజని పెద్ద గొప్ప!" అంటూ మూతి తిప్పింది ఆరతి.

"నీకే గొప్ప"

"నీకే గొప్ప"

"అవున్నాకే గొప్ప. నా పేరు కింగ్. నీపేరు ఆరతంట ఆరతి. ఏం బావుంది?"

"చూడు బామ్మా" ఏడుపు ముఖం పెట్టింది.

"ఊరుకోండర్రా. మీలో మీరలా పేర్లు పెట్టుకోవ చ్చా? తప్పుకదూ?" ప్రేమగా కసిరింది మహాలక్ష్మమ్మ.

"రాజులకథలూ వద్దు రాక్షసుల కథలూ వద్దుగానీ ఓ పాట పాడు బామ్మా" సుభాష్ అన్నాడు గోముగా.

"నా పాటలు మీకు నచ్చుతాయేవిట్రా. మా కాలంవేరు. మా పాటలువేరు" అంది నవ్వుతూ.

"నచ్చుతాయి బామ్మా పాడు. పాడు బామ్మా" అంతా ముక్తకంఠంతో కోరడంతో "జో అచ్యుతానంద జోజో ముకుందా. లాలి పరమానంద రామగోవిందా జోజో..." అంటూ తీయగా పాడింది.

"చాలా బాగా పాడావు బామ్మా" సుభాష్ మెచ్చుకున్నాడు.

"ముసిల్దాని పాటేం బావుంటుందిరా. ఇదివరకు మీ నాన్న చిన్నప్పుడు అంటే ఉయ్యాలతొట్లెలో వేసినప్పుడు ఈ పాట పాడితే అంతా ఎంతో బావుందని మెచ్చుకుని మళ్ళీ మళ్ళీ పాడించుకున్నారనుకో. ఆ రోజుల్లో ఏ ఇంట్లో పెళ్ళయినా పేరంటమైనా నేను పాడితే గాని ఊరుకునేవాళ్ళు కాదనుకోండి" ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా అంది మహాలక్ష్మమ్మ.

అయితే బామ్మా. నువ్వు రోజూ మా నాన్నని జోలపాటపాడి నిద్రపుచ్చే దానివన్నమాట. మా మమ్మీ కసలు పాటలేరావు బామ్మా"

ఆరతి మాటలకు సరదాగా నవ్వేసిందావిడ.

"మరేమో బామ్మా. చిన్నప్పుడు మా డాడీ మాలాగా బుద్ధిగా చదువుకునేవాడా? అల్లరి చేసేవాడా?" కుతూహలంగా అడిగాడు రాజు.

"అప్పుడేవిటి ఇప్పుడేవిటి వజ్రపుతునకేరా మీ నాన్న. ఇప్పుడు మీరు రిక్షాలమీద కార్లమీద బడికెళ్తున్నారుగానీ ఆ రోజుల్లో ఇవన్నీ వుండేవేమిటి. వానలో వరదలో నాలుగుమైళ్ళు నడిచి వీరవాసరం వెళ్ళి చదువుకునేవాడు బిడ్డ. చదువులోనూ సంధ్యలోనూ ఎంత చురుగ్గా వుండేవాడనీ. వద్దన్నా నాకు వంటలో సాయమూ వచ్చేవాడు. మీ తాతకి పొలం అన్నం మూటా పట్టుకెళ్ళేవాడు. మళ్ళీ చీకటి పడేసరికి కోడిగుడ్డు దీపం పెట్టుకుని గణగణా చదువుకునేవాడు. ఆ రోజుల్లో ఊళ్ళో వాళ్ళేమనేవారో తెలుసా? ఆ మహాలక్ష్మమ్మ కొడుకుని చూసైనా బుద్ధి తెచ్చుకోండ్రా అని పిల్లల్ని మందలించేవాళ్ళు. అలా కష్టపడి చదువుకున్నాడు గనుకే ఇవాళింత గొప్ప ఆఫీసరయ్యాడు. అన్నట్టు మరిచేపోయానర్రా. అప్పట్లో ఒకేడు ఆటల్లోనూ అదేదో రాత పోటీల్లోనూ మీ నాన్నకి బహుమతులొచ్చాయిరా. సబ్బుళ్ళ పెట్టి పెన్సిలూ చిన్న బొమ్మా ఇచ్చారు" గొప్పగా చెప్పింది.

బామ్మ మాటలకి కిలాకిలా నవ్వేశారు పిల్లలు.

"నవ్వుతారేమర్రా. నిజంగానే ఇచ్చారు"

"అవేం ప్రైజులుగానీ. సబ్బుపెట్టీ..." ఆపైన చెప్పలేక పోయింది ఆరతి నవ్వు ఉరికి రావడంవల్ల.

"చాలా గొప్ప ప్రైజులొచ్చాయి బామ్మా" రాజు అన్నాడు.

ఆవిడ ముఖం కందగడ్డ అయ్యింది. "ఆ రోజుల్లో అవే గొప్పమరి...".

బామ్మ నొచ్చుకుందని గ్రహించిన సుభాష్ మాటమారుస్తూ అన్నాడు "అద్సరే గానీ బామ్మా చిన్నప్పుడు మా డాడీని నువ్వెప్పుడూ కొట్టేదానివి కాదా?"

"సరదాకి కొడదామన్నా చిన్నతప్పుకూడా చేసేవాడు కాదర్రా మీ నాన్న. వాడ్ని చూసి మీ తాతెంత మురిసిపోయేవారో"

"అసలెప్పుడూ ఒక్కసారీ కొట్టలేదా గానీ?" నొక్కి అడిగాడు రాజు.

"అవాళేం జరిగిందంటే.. ఆ... మీ తాత 'నీరుకట్టు' అని కాబోలు పొలాన్నే ఉండిపోయారు. వండటానికింట్లో కూరేం లేదు. రోజూ కూరగాయలో చేపలో అమ్మొచ్చేది. అవాళవీరాలేదు. మీ తాత ఆకలి మీదొస్తారు ఏం వండనూ అని ఇదవుతుంటే మీ నాన్న విన్నాడు కామోసు మా పెదమావగారి దొడ్లోంచి చాటుగా ఇన్ని తోటకూర కాడలు పీకి పట్టుకొచ్చి ఇవి వండమ్మా అన్నాడు. ఎక్కడివిరా అంటే పెదతాతగారి దొడ్లోంచి ఎవరూ చూడకుండా గోడదాటెళ్ళి తెచ్చానన్నాడు గొప్పగా. నాకు వెర్రి కోపం వచ్చేసిందర్రా. కలలో కూడా చేయి జాడించి ఎరగని దాన్ని అవాళ నాలుగు బాదేశాను. ఇంకెప్పుడూ చెయ్యనన్నా విడిచిపెట్టకుండా వాడి రెక్క పట్టుకుని పెదమావగారింటికి తీసుకెళ్ళి వాడిచేత తోటకూర కాడలు ఇప్పించాను. పోనీలే చిన్నపిల్లాడు తెలిసీ తెలీకేదో చేశాడని మా పెదమావగారు సమర్థించినా నేనొప్పుకోలేదు. ఇలాటి చిన్న చిన్న దొంగపనులే పెద్దవవుతాయని వాళ్ళముందే లెంపలేసుకోమన్నాను..." ఆగిందావిడ ఊపిరి పీల్చుకోడానిక్కాబోలు.

మా తాతయ్య నిన్నేమీ అన్లేదా బామ్మా?"

ఆ ప్రశ్నవేసిన సుభాష్‌వంక ముసిముసిగా నవ్వుతూ చూసి అంది "చచ్చి ఏ స్వర్గాన వున్నారోగానీ మీ తాతెప్పుడూ నన్నేమీ అనేవారు కాదర్రా"

"మా డాడీని నువ్వు కొట్టినా ఏమీ అన్లేదా?" కొంచెం విస్తుపోతూ అడిగాడు రాజు.

"మీరెరగరు గానీ మీ తాత నిప్పులాంటి మనిషిగా. పరులసొమ్ము విషంతో సమానమనేవారు. మనది మనకుండాలి మనది మనం తినాలి గానీ ఎవరితో రావాలి ఎవరి సొమ్మో తినాలనుకోవడం మహాపాపం అనేవారు. బ్రతికినన్నాళ్ళూ ఆ మాట మీదే నిలబడ్డారు మారాజు. ఒకసారేమయ్యిందో తెలుసా?"

"ఏవయ్యింది గానీ" గబుక్కునంది ఆరతి.

"అప్పట్లో మీ తాత తాయారమ్మగారనీ మచ్చిపురి బ్రాహ్మల పొలం పాలుకి చేసేవారు. ఓసారి పంటలు సరిగ్గా పండలేదని కామోసు సర్కారోడు కౌలుధాన్యం ఇవ్వక్కర్లేదన్నాడు. అప్పుడు చాలామంది ఎగ్గొట్టేరు కూడాను. కాని మీ తాత ఊరుకోలేదు సుమా. వారికివ్వాల్సిన ధాన్యాన్ని బండిమీదేసుకుని వెళ్ళి ఇచ్చొచ్చారు. అప్పట్నుంచీ ఆ బ్రాహ్మలకీ మీతాతంటే ఎంతో నమ్మకం. మీ తాత వున్నన్నాళ్ళూ వారి పొలాన్ని మరొకళ్ళ కిస్తానన్నమాటే అన్లేదంటే నమ్మండి"

అలాగా అన్నట్టు తలలూపారు పిల్లలు.

ఆరతి ఆవులించడం చూసి "నిద్రొస్తోందా? పడుకోండిక" అందావిడ.

"నిద్రరావడం లేదు గానీ ఇంకా చెప్పు. నువ్వు చెప్పే

పెట్టెలంతో బావుంటాయి" అంది ఆరతి.

పిస్నగా నవ్వి అంది "ఏం చెప్పన్రా. ఆ రోజుల్లో మాట కోసం మంచికోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడేవారనుకో. ఇప్పుడేముందీ పిదపకాలమూ పిదప బుద్ధులూనూ"

"మా తాత గురించి చెప్పు బామ్మా." సుభాష్ అన్నాడు బామ్మ చెయ్యిపట్టుకుని కుదుపుతూ.

మనవడి వంక సంబరంగా చూసి అంది "ఆ మారాజు గురించేం చెప్పనర్రా. ఆయనకేం ఆయన దారి ఆయన చూసుకున్నారు నన్నొదిలేసి"

ఆమె కంఠం రుద్ధమయింది. సన్నగా వణికింది కూడా..

"ఊరుకో బామ్మా" గోముగా అన్నారు.

"ఆయన్ని మీలో చూసుకుంటూ ఏదో బండి లాగించేస్తూ భగవంతుడు నన్నెపుడు పిలుస్తాడా అని ఎదురు చూస్తున్నాను..."

"అలా మాట్లాడకు బామ్మా.. ప్లీజ్..."

"అలాగేలేరా. అప్పుడే ఎక్కడ పోతానా్రి. మీ పెళ్ళిళ్ళు చూశాకే పోతాను. కొడుకు ఐశ్వర్యమూ మనవ డి పెళ్ళిళ్ళూ చూట్టానికాయనెలగూ నోచుకోలేకపోయారు. నేనైనా చూస్తానేరా. ఇలాగైనా స్వర్గంలో ఉన్న మీ తాత సంతోషించనీ... ఇంక పడుకోండర్రా చాలా పొద్దుపోయింది" ప్రక్కమీది కొరుగుతూ అంది మహాలక్ష్మమ్మ.

గతకాలపు జ్ఞాపకాలు చాలాసేపటి వరకూ ఆవిడ్ని నిద్రపోనివ్వలేదు.

* * *

"ఏవండీ ఏవండోయ్"

"ఎవరూ" అంటూ బయటికొచ్చిన శ్యామల గుమ్మం ముందే నిలబడ్డ పల్లెటూరతన్ని చూసి "ఎందుకూ" అనడిగింది.

"తమరు సుబ్బారాయుడుగారి కోడలుకదండీ"

"అవును ఏం?"

మాదీ మల్లవరవేనండి. తవరు నన్నెరగరుగానీ అయ్యగార్నిగానీ అమ్మగార్నిగానీ పిలవండి. రావుడొచ్చా డని సెప్పండి శాన"

లోపలికెళ్ళి అత్తగార్తో చెప్పడం ఆలస్యం "రావుడొచ్చాడా? మన రావుడే?" అంటూ పొంగిపోతూ పరుగెత్తుకొచ్చింది మహాలక్ష్మమ్మ.

"ఒరే రావుడూ బాగున్నావ్రటా పరాయివాళ్ళా అక్కడే నిలబడిపోయావేంరా లోపలికి రా. నీ పెళ్ళాం పిల్లలు అంతా బావున్నార్రటా"

"ఏం బాగులెండి ఏదో ఇలా గున్నాం. మా గోలకేం గానండి తవరికిక్కడంతా బావుందాండి. శానా మారిపోయారు"



"బాగానే వుందిరా. కళ్ళల్లో పెట్టుకునే కొడుకూ కాలు కదపనివ్వని కోడలూ ప్రేమగా చూసుకునే మనవాళ్ళు. నాకేం లోటు చెప్పు? ఇప్పుడే వస్తాను కూర్చోరా" అని లోపలికెళ్ళి పెద్దగ్లాసుతో మజ్జిగ తెచ్చిచ్చింది. ఎందుకంటూనే పుచ్చుకుని త్రాగేశాడు.

"ఈ ఊరెప్పుడొచ్చావురా?"

"వారోజులైందండి. మా ఇంటి దానికి కేన్సరంటండి. అదొచ్చైనా తీసుకొచ్చానండి"

"కేన్సరొచ్చిందా? ఇప్పుడెలా వుందిరా?" ఆందోళనగా అడిగారావిడ!

"ఏదో వుందండి. రోజా కరెంటో ఏదో పెడతన్నారండి. పది ఇరవై రోజులన్నా వుండాలంటున్నారండి"

"ఉండాల్సొస్తే ఉండండ్రా. పూర్తిగా నయమయ్యాకనే వెళ్ళండి"

"ఆయ్ ఇల్లు అబ్బాయిగారిదేనాండి?"

"అవున్రా. విరుడేకట్టేడు. ఆ ప్రక్కభాగం అద్దెకిచ్చేశాడు. నెలకి మూడొందలు ఇస్తున్నారు. లోపల చూద్దువుగాని రారా"

"ఎందుకులెండి"

"రా రా"

"శ్యామలా వీడు రావుడని మీ మావగారు వ్యవసాయం చేసేరోజుల్లో మన కమతంలో పనిచేసేవాడు. మంచివాళ్ళే పాపం. భార్యకి ఒంట్లో బాగోకపోతేనూ ఇక్కడికి తీసుకొచ్చాట్ట. మా కోడల్ని ఎరుగుదువు కద్రూటా" కోడలికి పరిచయం చేస్తూ అంది మహాలక్ష్మమ్మ.

"ఎప్పుడో పెళ్ళిలో చూసేనండి"

"మళ్ళీ మనూరొస్తే కదా మాట్లాటానికి. ఈ ఏడాది అమ్మవారి తీర్థానికి అంతా రావాలనుకుంటున్నాం మరి. ఆపైన పల్లాలమ్మ దయ!

రండమ్మగారూ అంతా సంతోసిత్తారు"

"వస్తాంలేరా. ఇదిగో ఈ కుర్చీలూ కూర్చునే పరుపులూ (సోఫాలు) గాలి పంకాలూ అన్నీ అబ్బాయి కొన్నవే. ఇలారా — ఈ బీరువాలు కూడా అబ్బాయే కొన్నాడు." అంటూ వంటింట్లోకి తీసుకెళ్ళి అంది దాన్ని గేస్ష్టవ్ అంటార్రా. క్షణంలో కుంచెడు బియ్యం వార్చేయ్యొచ్చునుకో. భోషాణంపెట్టెలా వుంది చూడ అందులో బట్టలేస్తే చాలు వుతికి ఆరబెట్టేస్తుంది కాస్సేపట్లో"

"అలాగాండి. సిత్రంగానే ఉందండి"

"ఇదేంటో తెలుసా? పిండి రుబ్బే మిషన్రా. చిటికెలో మెత్తగా రుబ్బేస్తుందనుకో"

"అబ్బా అబ్బా ఎన్ని సిత్రాలో"

అంతే మరి. పనిమనుషులున్నా వాళ్ళు పేరుకి మనిమనుషులప్పా వాళ్ళేం శ్రమపడక్కర్లేదనుకో. అన్నిపనులు మిషన్లే చేసేస్తాయి. రారా అలా కూర్చో" అంటూ ఆవిడ హాల్లోని కుర్చీలో కూర్చుంది.

రావుడు ఆమె క్కొంచెం దూరంలో నేలమీద చతికిలబడ్డాడు.

"అబ్బాయి పిల్లలు లేనప్పుడొచ్చావు. రేపో ఎల్లుండో మళ్ళీ రారా. నీ పెళ్ళాన్ని కూడా తీసుకురా చూస్తుంది"

"అలాగేనండి. అబ్బాయిగారి ఇల్లు సూత్తావుంటే కన్నుల పండుగ్గా ఉందండి. తవురూ మా అయ్యగారూ చేసిన దానాలూ పూజలూ పున్నాలూ అబ్బాయిగార్నింత గొప్పోణ్ణి చేసిందండి"

"నీ అభిమానంగానీ మాదేవుందిరా. అంతా అబ్బాయి మంచితనమూ కోడలి అదృష్టమూనూ"

"అలాగనకండి మరి"

"సరేలేగాని కాళ్ళు కడుక్కో"

"ఇప్పుడలాటియేం పెట్టకండి. ఇంకో సారొత్తాను గదండి"

"మా ఇంటికొచ్చి చెయ్యి కడుక్కోకుండా వెళ్తావా? ఎలా వెళ్తావో వెళ్ళరా"

"తవరలాగంటే ఏవన్నండి"

"ఏమీ అనొద్దుగాని కాళ్ళు కడుక్కో"

కడుక్కోక తప్పింది కాదు.

ఊరి విషయాలు కనుక్కుంటూ దగ్గరుండి కొసరి కొసరి వడ్డించింది మహాలక్ష్మమ్మ. తృప్తిగా భోంచేసి త్రేన్చాడు రావుడు.

"కాలం ఇదివరకట్ల లేదండమ్మగారూ. రెక్కలు ముక్కలు చేసుకుని పండించడమే గానీఁడి గింజలకి రేటు రేటుండటం లేదండి. కొనాల్సిన ఎరువుల ధరలు మాత్రం అంతూ పొంతూ లేకుండా పెరిగిపోతున్నాయండి. ఇంక సిన్నపనైనా సిటికె పనైనా అంతా సొమ్ముల్తో ఉందండి. సొమ్ము లివ్వకపోతే కాలవ దిండా నీళ్ళున్నా కాలవ పక్క చేలోకి నీళ్ళు రావండి. ఈ ఏడు లేని దాళ్వా తెచ్చుకోడానికి గవర్నమెంటోడికి కట్టింది కాక ఎకరాకి వలభై రూపాయల చొప్పున మామూళ్ళిచ్చామండి".

"మీ ఉసురూ మా ఉసురూ పోసుకుని వాళ్ళేం బాగుపడతాల్లేరా. ఎప్పుడో అంతకంతా కొట్టకమానదు."

"మరి నేనెల్లొత్తానండి. ఒచ్చేళ్ళానని అబ్బాయిగార్తో సెప్పండి"

"చెబుతాను గానీ రేపో ఎల్లుండో ఏ సాయంత్రమపుడో ప్రొద్దునప్పుడో రారా. తృణమో పణమో ఇస్తాడు అబ్బాయి. ఈ మహాపట్నంలో ఎంత డబ్బున్నా చాలదు. ఇక నీలాటి వాళ్ళ సంగతి చెప్పాలా?!"

"వత్తానమ్మగారూ" చెమ్మగిల్లిన కళ్ళతో చేతులు జోడించారు రావుడు.

"వెళ్ళిరారా రేపో ఎల్లుండో తప్పకుండా రావే"

"ఆయ్"

వెళ్తోన్న రావుడి వంక పుత్రవాత్సల్యంతో చూస్తుండిపోయింది మహాలక్ష్మమ్మ చాలాసేపు.

* * *

"నర్సయ్య అపుడే కేరేజి తెచ్చేశావేమిటే. అయ్యగారు భోంచెయ్యలేదా?" అరగంట క్రితం తను పంపిన కారేజీతో వచ్చిన పూర్యాన్నడిగింది శ్యామల.

"తిన్లేదండి"

"ఏంరా ఏమైనా డిన్నరుందా?"

"అబ్బే... బుర్రగోక్కుని ఇబ్బందిగా చూశాడు.

"మరెందుకు తిన్లేదురా? ఫోన్ చేస్తానుండు"

"అయ్యగార్లేరండి"

"ఎక్కడికెళ్ళేరు?"

"పోలీసుల కూడా వెళ్ళారండి"

"ఎక్కడికి?"

"మరండీ — అయ్యగారు లంచం తీసుకుంటుంటే పట్టుకుని తీసుకెళ్ళారండి...."

"ఏవిట్రా నువ్వు చెప్పేది నిజమేనా?" కాళ్ళ కింది భూమి కంపిస్తోంటే అడిగింది.

"అవునండి అయ్యగారి రాబడిని చూసి కుళ్ళిపోతున్న ఆఫీసువాళ్ళే పట్టిచ్చారంటున్నారండి"

"వాళ్ళకేం పోయేకాలంరా. దొరికిన కాడికి వాళ్ళు మాత్రం మింగడంలేదూ. వాళ్ళేదో మడిగట్టుక్కూర్చున్నట్టు వెన్నుపోటు పొడుస్తారు. వాళ్ళ పీనుగులు




## సలహా

"బస్ ఆపేయ్ గురూ. బ్రిడ్జి తాకుతోంది" కంగారుగా అరిచాడు కండక్టర్.

"నీకేం భయంలేదు. తలవొంచుకో" సలహాపారేస్తూ నింపాదిగా చెప్పాడు డ్రైవర్.

—విజయలక్ష్మి
(సికింద్రబాద్)





## హెల్మెట్

"చూడు బాబు! నీ తలకి పెద్ద దెబ్బ తగిలింది. అందుకే కట్టు కట్టా. నీళ్ళు తగలకూడదు" వివరిస్తూ చెప్పాడు డాక్టర్ పిల్లాడితో.

"సరే డాక్టర్. హెల్మెట్ పెట్టుకుని స్నానం చేస్తాలేండి" అన్నాడు గడుగ్గాయి.

—విజయలక్ష్మి
(సికింద్రాబాద్)

కాటికెళ్ళ! ఇప్పుడెలారా నాకు ఒకటే వణుకు దేడా వస్తోందీ"

"అయ్యగారు ప్లీడరుగార్ని పిలిచి వారితో కలిసెళ్ళారండి. ఇంకొంచెం సేపట్లో వచ్చేస్తారండి"

"సరిసర్లే. ఎవర్తోనూ అనకే" అని చెప్పి ఎలావోలా ఈ గండం గడిస్తే ఇక జాగ్రత్తగా వుండాలి...." అనుకుంటూ కళ్ళు తుడుచుకుంటూ తనగదిలో కెళ్ళిపోయి పడుకుంది శ్యామల.

కొంచెంగా వారి సంభాషణ విన్న మహాలక్ష్మమ్మ కంతా అయోమయంగా అన్పించింది. కోడలెందుకలా ఆందోళన పడుతోందో అర్థంకాలేదు బొత్తిగా. ఆమె తల్లి మనస్సేదో కీడుని శంకిస్తోంటే వెళ్తోన్న వ్యాన్నాపి "ఏం జరిగిందిరా" అనడిగింది.

ఏంలేదని తప్పించుకోచూశాడుగానీ ఆమె వదలకపోయే సరికి చెప్పక తప్పలేదు వాడికి.

సాంతం వినకుండానే తాడెత్తున లేచిందావిడ "మా అబ్బాయి లంచం తీసుకున్నాడా? ఎవడ్రా అలా కూసిందీ వాడినోట్లో పురుగులడ! ఒరే మాది నిప్పులాంటి వంశంరా. ఇతరుల సొమ్ముకాశపడి నానా గడ్డీ మేయడం మా వంశంలోనే లేదురా ఏవిటనుకున్నావో. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మసలు లేకపోతే అబ్బాయితో చెప్పి నీ ఉద్యోగం పీకేయిస్తాను"

ఆ మాటలకి వాడిక్కోపం వచ్చింది. ఓ ముసల్ది ఆఫీసర్ల గుట్టుమట్లు జీర్ణించుకున్న తనని గడ్డిపరకలా తీసిపారేస్తుందా అనుకున్నాడు. "ముందు మీ అబ్బాయిగారి ఉద్యోగం ఊడిపోకుండా చూసుకోండి. మా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్లో ఇంజనీరైన మీ అబ్బాయికి అన్నిటా పెద్దవాటా అని మీకు తెలీకపోతే తెలుసుకోండి గానీ అనవసరంగా నోరు పారేసుకోవద్దు. దాళ్వాలేని పొలాల్లో దాళ్వా పండించుకోనిస్తున్నందుకు గాను రైతులు దగ్గర్నుంచి మామూళ్ళొసూలు చేసి అయ్యగారికి పెద్దవాటా ఇస్తోంటేనే పట్టుకున్నారివాళ!"

మాన్పడిపోయింది మహాలక్ష్మమ్మ. రైతు కడుపున పుట్టిన తన బిడ్డ రైతుల కడుపుకొట్టి తన ఇల్లు నింపుకుంటున్నాడా? ఎంత దారుణం!

ఆవిడ బాణం దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడుతోంటే నరసయ్య "ముసలమ్మగారూ! మీకు తెలుసో లేదో ఈ ఇల్లు లంచాలతో కట్టిందే. ఇంట్లోని సరుకుల్లో చాలావరకు లంచాలుగా వచ్చినవే. ఈ సంగతి మీకు తెలీదేమోగానీ ఊరందరికీ తెలుసండి" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు.

అవాక్కైపోయిందావిడ. చెప్పలేనంత నీరసం ఆవహించడంతో వీధి అరుగు మీదే కూలబడిపోయింది నిస్త్రాణగా. గుండెల్లోంచి గుబులుగుబులుగా దుఃఖం పొంగివస్తోంటే పిచ్చిదాన్లా వీధిలోకి చూస్తూండి పోయింది.

కొంచెంసేపాటికి జీపువచ్చి ఆగింది ఇంటిముందు. అందులోంచి విశ్వనాథం దిగాడు. అతడి మొహం నల్లగా వుంది. రక్తహీనంగా ఉంది.

విషాదమూర్తిలా కూర్చునున్న తల్లిని చూసి ఉలిక్కిపడ్డాడు. అప్పుడెప్పుడో చిన్నప్పుడు తోటకూర కాడలు దొంగిలించినపుడు తల్లి చేసిన రాద్ధాంతం గుర్తొచ్చింది. తలొంచుకుని లోపలికెళ్ళిపోయాడు. అతన్లో పశ్చాత్తాపం రగిలింది. కొన్ని క్షణాలే అయినా...

కొడుకు వాలకాన్ని బట్టి తను విన్నదంతా నిజమే అన్పించింది మహాలక్ష్మమ్మకి. కాని కొడుకింతిలా దిగజారతాడంటే ఇంకా పూర్తిగా నమ్మకం చిక్కక మెల్లగా లేచి గది దగ్గరకెళ్ళింది.

అబ్బాయ్ నేవిన్నది నిజమేన్రటా" ఆమె గొంతు కంపిస్తోంటే కళ్ళు కన్నీళ్ళతో నిండిపోతోంటే అడిగింది.

ఎవరూ మాట్లాడలేదు.

మళ్ళీ అడిగిందామె.

"ఈ గొడవనుంచి బయటపట్టం ఎలారా దేవుడా అని మేం ఇదవుతోంటే మధ్యన మీ గొడవేమిటీ. వెళ్ళి మీ పని చూసుకోండి".

కోడలు కసిరినందుకు బాధగా అన్పించలేదు గాని తనన్న మాటల్ని వాళ్ళు కంఢించనందుకు తల్లడిల్లిపోయింది.

"వాడు కూసిందంతా నిజవేనన్నమాట...." గొణుక్కుంటూ కళ్ళు తుడుచుకుంటూ పెరటివైపెళ్ళింది. పనిమనిషి గోడదగ్గర నిలబడి ప్రక్కింటావిడతో ఏదో చెప్పి నవ్వుతోంది.

మహాలక్ష్మమ్మ ప్రాణం విలవిల్లాడింది.

అయితే వార్తప్పడే చెవులు మారుతోందన్నమాట. రేపటికి ఊరందరికీ తెలిసిపోతుంది. ఎల్లుండి తన ఊరివాళ్ళకీ తెలిసిపోతుంది. అంతా ఫలానా మహాలక్ష్మమ్మ కొడుకు అవినీతిపరుడంటూ పగలబడి నవ్వుతారు. ఫలానా సుబ్బారాయుడి కడుపున చెడబుట్టాడంటూ నిందిస్తారు. అవి తను వినగలదా? విని భరించగలదా? భగవంతుడా! ఈ వయస్సులో ఎలాటి కష్టం తెచ్చిపెట్టావయ్యా!

కాలుగాలిన పిల్లిలా కలదిరుగుతోంటే "గుడీవినింగ్ బామ్మా" అంటూ వచ్చారు కాన్వెంట్‌నుంచి మనవలూ మనవరాలూ..

రోజులా వాళ్ళతో సరదాగా మాట్లాడలేకపోయింది. బామ్మ మూడ్ మారిపోయిందేవిటీ అనుకుంటూ లోపలికెళ్ళి బోర్నవిటా త్రాగి ఆటలకెళ్ళిపోయారు క్రికెట్ బ్యాట్లు పట్టుకుని.

పిచ్చిదాన్లా అటూ ఇటూ తిరుగుతూ వంటింట్లో కెళ్ళింది మహాలక్ష్మమ్మ. గ్యాస్‌స్టవ్, వాషింగ్ మెషీన్, మిక్సీ.... తనని చూసి నవ్వుతున్నట్టనిపించి హాల్లో కొచ్చేసింది. కుర్చీలూ సోఫాలూ ఇంటిగోడలూ కప్పు అన్నీ పగలబడి నవ్వుతున్నట్టుగా అన్పించింది. ఇవన్నీ కొందరి నోళ్ళు కొట్టి వాళ్ళు ఉసురుపోసుకుని కొన్నవే అన్పించేసరికామె కెంతో కంపరంగా అన్పించింది. ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులు ప్రాకుతున్నట్టనిపించి నేలమీద కూలబడి అరచేతుల్లో మొఖం దాచుకుని బావురుమంది.

తలెత్తి చూసిన విశ్వనాథం అతడి భార్య గుమ్మంలో నిలబడి ఉన్న మహాలక్ష్మమ్మనీ ఆమె చేతిలో వున్న పాత ట్రంకుపెట్టెనీ చూసి మ్రాన్పడిపోయారు.

"నేను వెళ్తున్నానాని"

"ఎక్కడికమ్మా" బాధగా అడిగాడు విశ్వనాథం తల్లి కళ్ళల్లోకి సూటిగా చూడలేక తలదించుకుంటూ.

"మనూరికిరా ఇక్కడుండి పరమాన్నాలూ తినేకన్నా మనూళ్లో కలో గంజో త్రాగితే ప్రాణానికెంతో హాయిగా శాంతిగా ఉంటుందిరా"

"ఇప్పుడేం జరక్కూడనిది జరిగిందనీ ఆ పల్లెటూరు పోతానంటున్నారూ?" విసవసగా చూస్తూ విసురుగా అంది కోడలు.

"ఏమీ జరగనట్టే మీ కన్పించవచ్చు. కాని నాకిక్కడ ఊపిరాట్టంలేదురా. నీ ఇల్లూ నీ వస్తువులూ నన్ను చూసి నవ్వుతున్నాయిరా. ఇన్నాళ్ళూ కళ్ళు మూసుకునిక్కడ పడుండి పాపిష్టికూడు తిన్నందుకు నాఒళ్ళు దహించుకుపోతోందిరా. ఒరే అబ్బాయ్ — ప్రేగు త్రెంచుకుని నువ్వు పుట్టినపుడు కూడా నేనింత నరకం అనుభవించలేదురా. కాని ఇలాటివాడికి జన్మనిచ్చానే ఇలాటి వాడికి పాలిచ్చి పెంచానే అని ఇవాళ కుళ్ళిపోతున్నాన్రా. సిగ్గుతో చితికిపోతున్నాన్రా..."

ఆమె కళ్ళనుండి కన్నీళ్ళు జలజలా రాలాయ్.

విశ్వనాథం శిరస్సు మరింత కృంగిపోయింది.

శ్యామల మాత్రం ఊరుకోలేదు. "మీరెక్కడో పాతకాలం మనిషి కనుగ అలా అన్పిస్తోంది. గానీ ఈ రోజుల్లో ఇదంతా మామూలే. పెద్ద పెద్ద వాళ్ళనుంచి చిన్న చిన్న వాళ్ళదాక అంతా చేస్తున్న పనే ఇది" అన్నది.

"అందుకు వాళ్ళవాళ్ళ తల్లులూ తండ్రులూ పొంగిపోతున్నారో కృంగిపోతున్నారో నాకు తెలీదుగానీ నేను మాత్రం దుఃఖంతో బాధతో కుళ్ళు తిరుగుతున్నానమ్మా. అవున్లేనూ పాతకాలప్పు మనిషినే. ఈ మాయలు మోసాలుతెలీని దాన్నే కానొక్క సంగతిరా అబ్బాయ్. ఏ తల్లి అయినా ఏ తండ్రి అయినా తమ బిడ్డలు స్వశక్తితో స్వయం కృషితో పైకొస్తే ఎంతో సంతోషిస్తారు. వాళ్ళు నలుగురికీ సాయపడితే మరింత ఆనందిస్తారు. వాళ్ళని పదిమందీ పొగిడితే పొంగిపోతారు. కానీ... అంతా తిట్టుకుంటుంటే లంచగొండి అని నవ్వుతోంటే ఆ నరకం భరించలేన్రా. అంతకంటే కడుపుకోతే మేలురా. వస్తానాని. నా అంత అయిన నీకు చెప్పతగ్గదాన్ని కాదుకాని చిన్నప్పటి తోటకూర కాడల సంగతోసారి గుర్తుచేసుకుని లెంపలేసుకోరా. అప్పుడు నిన్ను జూసి నేనూ స్వర్గాన వున్న మీ నాన్న సంతోషస్తాం. దీవిస్తాంరా. లేదంటావూ ఇదో పిచ్చిదనుకుని మర్చిపోరా. వస్తానాని...."

పైట చెంగుతో కళ్ళు వత్తుకుంటూ ట్రంకుపెట్టె పట్టుకుని మెల్లగా నడిచెళ్ళిపోతున్న మహాలక్ష్మమ్మ వంక గుడ్లప్పగించి చూస్తుండిపోయారామె కొడుకూ కోడలూ.

(అంకితం: మా మామ్మ కీ.శే వెలంకూరి మహాలక్ష్మమ్మ స్మృతికి — రచయిత)